క్లుప్తంగా

రైతు బజార్‌లో సరుకుల పంపిణీ నేడు

పొదలకూరు : పట్టణంలోని రైతుబజారులో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు నిత్యావసర సరుకులను తక్కువ ధరలకు అందజేస్తారు. ఈ కార్యక్రమాన్ని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రారంభిస్తున్నట్లు మార్కెటింగ్‌శాఖ అధికారులు వెల్లడించారు. ముందుగా బియ్యం, కందిపప్పు తదితర సరుకులను అందజేస్తారన్నారు.

సాయినాథునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు : పట్టణంలోని శ్రీశిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్ర నామాలతో పూజలు, సాయంత్రం మందిరంలో భక్తుల భజనలు, రాత్రి స్వామివారికి పల్లకి సేవ గావించారు. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

డైట్ కళాశాలలో సెమినార్



ఇందుకూరుపేట : మండలంలోని పల్లిపాడు ప్రభుత్వ డైట్ కళాశాలలో ఛాత్రోపాధ్యాయులకు గురువారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ జనాభా నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. జనాభా నియంత్రణపై తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు.

బీసీజీ వ్యాక్సిన్‌పై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న వెంకట్రావు

కొడవలూరు : బహుళ ప్రయోజనాలున్న బీసీజీ వ్యాక్సిన్‌పై కార్మికుల్లో అవగాహన అవసరమని హెల్త్ అసిస్టెంట్ వెంకట్రావు సూచించారు. మండలంలోని రాచర్లపాడు గమేసా ఫ్యాక్టరీలో కార్మికులకు బీసీజీ వ్యాక్సిన్ ఉపయోగాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీజీ వ్యాక్సిన్‌ను 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ వ్యాక్సిన్ వేయించుకోవచ్చన్నారు. దీనివల్ల క్షయ వ్యాధి రాకుండా ఉండడంతో పాటు బీపీ, షుగర్‌లను నియంత్రించవచ్చన్నారు. అయితే దీనిని ప్రస్తుతం క్షయ వ్యాధితో బాధపడుతున్న వారు వేయించుకోకూడదన్నారు. ధూమపానం అలవాటు ఉన్న వారు, షుగర్‌తో బాధపడుతున్న వారు, క్షయ బాధితులతో దగ్గరి సంబంధాలున్న వారు విధిగా వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్షయ నియంత్రణ పర్యవేక్షకులు సత్యనారాయణ, నవీన్, ఫ్యాక్టరీ మేనేజర్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

అనికేపల్లిలో ఉచిత వైద్యశిబిరం



రోగులకు వైద్య సేవలందిస్తున్న వైద్యులు

వెంకటాచలం : మండలంలోని అనికేపల్లి గ్రామంలో నారాయణ హాస్పిటల్ సహకారంతో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చల్లా రవీంద్ర, గొట్టం బ్రహ్మయ్య, చెమికల కిష్టయ్య, మండల మణి, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వెన్నుపోటు





అనుకున్నదే జరిగింది. తల్లికి వందనం పేరుతో కూటమి ప్రభుత్వం తల్లిదండ్రులను నిలువునా వెన్నుపోటు పొడిచింది. ఎప్పటిలానే చంద్రబాబు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతూ తన పరిపాలన సాగిస్తున్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ రూ.15 వేలు చొప్పున ఇస్తానని చంద్రబాబు గతంలో ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన రెండు నెలల తరువాత తల్లికి వందనం హామీని నీరుగార్చారు. తాజా జీఓ ప్రకారం ఎంత మంది పిల్లలు ఉన్నా తల్లికి రూ.15 వేలు మాత్రమే ఇస్తానని తెలపడంపై తల్లుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

- ఇచ్చిన హామీ అమలులో మాటతప్పిన బాబు
- ఇంట్లో ఒక్కరికే పథకం వర్తింపు
- ఈచ్ మదర్ రూ.15 వేలు అంటూ జీఓ జారీ

పొదలకూరు : బడులకు పంపే పిల్లలందరికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామని చెప్పి చంద్రబాబు ఎన్నికల హామీల్లో ఊదరగొట్టారు. ముగ్గురు పిల్లలు ఉన్న కుటుంబానికి రూ.45 వేలు పొందవచ్చని ఆశపడి ఓట్లు వేశారు. అంతే కాక రూ.45 వేలు అంటే ఓ చిన్న కుటుంబానికి ఎంతో ఆధారంగా ఉంటుందనే భావన పేదల్లో నెలకొని కూటమిని ఆదరించారు. అంతే కాకుండా ఎన్నికల సమయంలో జగన్ సర్కార్ పిల్లలను బడులకు పంపే విషయంలో తల్లులను మోసం చేస్తోందని తాము అధికారంలోకి వస్తే ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామని వెల్లడించారు. జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ కూడా ఈ హామీని సమర్థిస్తూ వచ్చారు. అయితే జీఓ నంబర్ 29 ప్రకారం ఆధార్‌కార్డుతో పథకాన్ని వర్తింప చేస్తామన్నారు.

దీన్నిబట్టి ఒక ఇంట్లో ఒకరికే తల్లికి వందనం రూ.15 వేలు వంతున అందజేస్తామని చెప్పకనే చెబుతున్నారు. పేదరికానికి అనేక అంశాలను ప్రామాణికంగా తీసుకుంటామని పేర్కొనడంపై లబ్ధిదారులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తల్లికి వందనం పథకం అమలుపై ఆత్రుతగా ఎదురు చూస్తున్న తల్లులు ఒక రకంగా ఢీలాపడ్డారు. ప్రభుత్వ మార్గదర్శకాలతో గందరగోళంగా ఉందని, భవిష్యత్తులో పథకంపై కోతలు పెట్టే అవకాశం లేకపోలేదని ప్రచారం జరుగుతోంది.

ఆశపడి భంగపడ్డాం



తల్లికి వందనం పథకం పేరుతో కుటుంబంలో ఎందరు పిల్లలు ఉంటే అందరికీ రూ.15 వేలు వంతున నగదును చంద్రబాబు బ్యాంకులో జమచేస్తారంటే ఎంతో ఆశపడ్డారు. ఇప్పుడు ఒక్కరికే పథకం వర్తింపజేస్తారనే జీఓ ఇచ్చినట్టుగా తెలుస్తోంది. నాకు ఇద్దరు పిల్లలు ఉండగా ఒకరు ఎనిమిది, మరొకరు తొమ్మిదో తరగతులు చదువుతున్నారు. వారి చదువులకు నగదు ఉపయోగపడుతుందని ఆశపడి భంగపడ్డాం.

– ఒ.నాగమణి, తల్లి, తోడేరు, పొదలకూరు మండలం

ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి



మా ఇద్దరు పిల్లలు ప్రైవేటు స్కూల్లోనే చదువుతున్నారు. పాఠశాలలు ప్రారంభించి నెల కావస్తుండడంతో స్కూల్ ఫీజులు కట్టాలని యాజమాన్యం ఒత్తిడి తెస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా అందరికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ మేరకు త్వరగా నగదు చెల్లిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

– బి.ప్రసన్నలక్ష్మి, తల్లి, మనుబోలు

నమ్మించి గొంతు కోశాడు



సీఎం చంద్రబాబు ఇచ్చిన మాటను తప్పి మాలాంటి నిరుపేదల గొంతుకోయడం మంచి పద్ధతి కాదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఇంట్లో ఎంత మంది బిడ్డలు పాఠశాలకు వెళ్తున్నారో వారందరికీ రూ.15 వేల చొప్పున ఇవ్వాలి. మాకు ఇద్దరు సంతానం. పెద్ద కుమారుడు దేవకుమార్ నాలుగో తరగతి, రెండో కుమారుడు నిఖిల్ రెండో తరగతి చదువుతున్నారు. చంద్రబాబు చెప్పిన మాట ప్రకారం రూ.30 వేలు రావాల్సి ఉంది. కానీ ఒక్కరికే ఇస్తామని చెప్పడం దారుణం. ఆ డబ్బులు కూడా ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి. గత ప్రభుత్వంలో పాఠశాలలు తీసిన వెంటనే అమ్మఒడి నగదు తల్లులు ఖాతాలో జమైంది.

– నావూరు లక్ష్మి, పడుగుపాడు, కోవూరు

ఇద్దరు పిల్లలకూ ఇవ్వాలి



నా ఇద్దరు ఆడపిల్లలు జెడ్పీ హైస్కూల్లో చదువుకొంటున్నారు. తల్లికి వందనం పథకం కింద ఎంతమంది పిల్లలు చదువుకుంటే వారికి ఏటా రూ.15,000ల చొప్పున ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ ఆశతోనే పిల్లలను చదివిస్తున్నా. ఇప్పుడు కుటుంబంలో ఒక్కరికి మాత్రమే తల్లికి వందనం ఇస్తామని చెబుతున్నారు. ఇచ్చిన హామీ ప్రకారం నా ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నా.

– కనకా భారతి, బ్రహ్మదేవి, ముత్తుకూరు మండలం

ఇచ్చిన మాటను నెరవేర్చాలి



నా ఇద్దరు బిడ్డలు సౌత్‌ఆములూరులోని ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతి, మూడో తరగతి చదువుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తల్లికి వందనం పథకం కింద ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ రూ.15 వేల వంతున ఆర్థిక సాయం అందిస్తానని హామీ ఇచ్చింది. దీని ప్రకారం రూ.30 వేల ఆర్థిక సాయం అందాలి. ఇచ్చిన మాటను నెరవేరిస్తే బాగుంటుంది.

– ఎస్.దేవసేన. విలుకానుపల్లి, తోటపల్లిగూడూరు మండలం

ఫీజుల భారం తప్పదు



నా ఇద్దరు పిల్లలు ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. పాప ఏడో తరగతి, బాబు తొమ్మిదో తరగతి చదువుతున్నారు. వీరిద్దరికీ ఫీజులు చెల్లించడం మా స్థాయికి పెనుభారం. ఎన్నికల సమయంలో తల్లికి వందన పథకం ద్వారా ఎంత మంది పిల్లలుంటే అంత మందికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని చంద్రబాబు చెప్పడంతో ఫీజుల భారం తప్పుతుందని భావించి నమ్మి ఓటు వేశాం. తీరా గెలిచాక చెప్పినట్లు కాకుండా ఎంత మంది పిల్లలు న్నా తల్లికి రూ.15 వేలు ఇస్తామని జీఓ ఇవ్వడం బాధ కలిగించింది. ఫీజుల భారం తప్పేలా లేదు.

– దేవర సంపూర్ణ, విద్యార్థుల తల్లి, నార్తురాజుపాలెం

రూ.30 వేలు వస్తుందని ఆశపడ్డాం



చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను అమలు చేయాలి. తల్లికి వందనం పథకం పక్కా గా అమలు చేస్తే మాకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. నా ఇద్దరు పిల్లలు ప్రైవేటు పాఠశాల, కాలేజీల్లో చదువుకుంటున్నారు. ఇద్దరు పిల్లలకు రూ.30 వేలు వస్తుందని ఆశపడుతున్నాను. అయితే ఒక్కరికే పథకం వర్తిస్తుందనే ప్రచారం జరుగుతోంది. దీనివల్ల కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చదనే అనుమానం కలుగుతోంది.

– వై.పద్మజా, మొగళ్లూరు, పొదలకూరు(మం)

ఆశలు రేకెత్తించి అడియాశలు చేశారు



నా ఇద్దరు కుమార్తెలు కొడవలూరు జెడ్పీ హైస్కూల్లో 9, 10 తరగతులు చదువుతున్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు తల్లికి వందనం పథకం కింద ఎంత మంది పిల్లలుంటే అందరికీ ఏడాదికి రూ.15 వేల చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో నాకు ఇద్దరు పిల్లలున్నందున ఏడాదికి రూ.30 వేలు వస్తుందని ఆశ పడ్డాను. కానీ ఎన్నికల్లో గెలిచి పథకాన్ని అమలు చేసే సమయానికి ఎంత మంది పిల్లలున్నా తల్లికి రూ.15 వేలు ఇస్తామని చంద్రబాబు చెప్పడం నిరాశకు గురిచేసింది. ఎన్నికల హామీని తప్పకుండా అమలు చేసి ఉంటే సంతృప్తి ఉండేది. మాట మార్చి ఒక్కరికే రూ.15 వేలు ఇస్తాననడం బాధ కలిగించింది.

– మండవ శ్రీలత, విద్యార్థినుల తల్లి, కొడవలూరు

అందరికీ వస్తుందనే ఓటేశా



నాకు ఇద్దరు పిల్లలు. నెల్లూరు రూరల్ మండలం కృష్ణనగర్‌లో ఉన్న జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి, ఏడో తరగతి చదువుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఒక కుటుంబంలో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అందరికీ తల్లికి వందనం వస్తుందని నమ్మబలికి ప్రస్తుతం ఒకరికి మాత్రమే ఇస్తామడం బాధ కలిగించింది. ఇది మంచి పద్ధతి కాదు. అందరికీ తల్లికి వందనం వస్తుందనే ఆశతో టీడీపీకి ఓటేశాం. ప్రస్తుతం ఆశలన్నీ అడిఆశలయ్యాయి.

– కె.స్రవంతి, వావిలేటిపాడు, 12వ వార్డు

అధిక ఫీజులపై చర్యలు తీసుకోండి



వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

పొదలకూరు : ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సునీల్ డిమాండ్ చేశారు. పొదలకూరులోని ఎంఈఓ కార్యాలయంలో గురువారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు బుక్స్ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని తెలిపారు. అనుమతి లేకుండా హాస్టళ్లను నిర్వహిస్తూ వేలాది రూపాయలను వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాంటి పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల నాయకులు ఆర్.నాని, వై.తేజ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు కృషి

- డిప్యూటీ డీఈఓ రఘురామయ్య



హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డిప్యూటీ డీఈఓ రఘురామయ్య

కొడవలూరు : విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు కృషి చేస్తున్నట్లు డిప్యూటీ డీఈఓ పి.రఘురామయ్య తెలిపారు. మండలంలోని కొత్తవంగల్లు జెడ్పీ హైస్కూల్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలు చేస్తున్న బోధన పద్ధతులు, విద్యార్థుల సంఖ్య, సామర్థ్యాలు, వసతులు, మధ్యాహ్న భోజన పథకం అమలు, విద్యాశాఖ నిర్దేశించిన కార్యక్రమాల అమలును పరిశీలించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయ బృందంతో సమావేశం నిర్వహించి సూచనలు, సలహాలు అందించారు. విద్యాశాఖ కేటాయించిన కార్యక్రమాలను తప్పకుండా అమలు చేయడం ద్వారా విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచవచ్చన్నారు. పాఠశాల విద్యార్థులు డ్రాపౌట్స్ కాకుండా చూసుకోవడంతో పాటు బడి బయట చిన్నారులను గుర్తించి పాఠశాలలో చేర్చాలన్నారు. విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచేందుకు హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం సమైక్యంగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఎంఈఓ ఎస్.అంకయ్య, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు రామ్‌కుమార్, వై.కొండారెడ్డి, జి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడుతాం

- కార్యకర్తలకు అన్యాయం జరగనివ్వం
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు : అధికారంలో ఉన్నా.. లేకున్నా ప్రజల పక్షాన నిలబడి పోరాడుతామని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మనుబోలు మండల కేంద్రంలోని పద్మావతి ఫంక్షన్ హాల్లో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎన్నో హామీలు, ప్రజల ఆకాంక్షలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వాటిని నిలబెట్టుకోవాలన్నారు. ఈ ప్రభుత్వం హామీలను అమలు చేయని పక్షంలో మా కార్యాచరణను రూపొందించుకుని ప్రజల పక్షాన పోరాడుతామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకున్నారన్నారు. అయినా ఓటమిపాలైనందున దానిపై గ్రామాల వారీగా, కాలనీల వారీగా లోటుపాట్లపై సమీక్షించుకుంటామని తెలిపారు. అధికార బలంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడితే సహించబోమన్నారు. అన్నింటినీ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. ఆయన వెంట ఎంపీపీ వజ్రమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు అనితమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నెల్లూరు (టౌన్) : స్థానిక డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, పెయింటింగ్ పోటీలను గురువారం నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. నెహ్రూయువ కేంద్రం, డీకేడబ్ల్యూ ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు ప్రపంచ జనాభా పెరుగుదలపై ప్రభావం అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నెహ్రూయువ కేంద్రం కోఆర్డినేటర్ మహేంద్రరెడ్డి, ఆర్ఐఓ శ్రీనివాసులు, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కొండయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు కరుణకుమారి, ప్రసన్న, భారతి, సెట్నల్ సూపరింటెండెంట్ గయాజ్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

గంబూసియా చేపలతో దోమల నివారణ

- వైద్యాధికారి ఎం.రామకృష్ణ



కొడవలూరులో గంబూసియా చేప పిల్లలను వదులుతున్న వైద్య బృందం

కొడవలూరు : గంబూసియా చేపలను మురుగు కాలువలు, గుంతల్లో వదలడం ద్వారా దోమల ఉత్పత్తిని నివారించవచ్చని కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రామకృష్ణ తెలిపారు. కొడవలూరు పీహెచ్‌సీ ప్రాంగణంలోని మురుగు నీటి కాలువ, తహసీల్దార్ కార్యాలయం పక్కనున్న నీటి గుంత, మూలకట్ల గిరిజన కాలనీలోని మురుగు నీటి కాలువల్లో గంబూసియా చేప పిల్లలను గురువారం వదిలారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ దోమలను ఉత్పత్తి చేసే లార్వాను గంబూసియా చేపలు ఆహారంగా తీసుకోవడం ద్వారా దోమల ఉత్పత్తిని నివారించవచ్చన్నారు. కొడవలూరులోని మురుగు నీటి కాలువల్లో గంబూసియా చేప పిల్లలను వదిలినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ టి.సోమశేఖర్, హెచ్‌ఏ షఫీ ఉద్దీన్, స్టాఫ్ నర్స్ వెన్నెల, ల్యాబ్ టెక్నీషియన్ మెర్సీ, ఫార్మాసిస్ట్ సరస్వతి పాల్గొన్నారు.

కౌలు రైతులు సీసీఆర్ కార్డులు పొందాలి



కొడవలూరు : రైతులకు సీసీఆర్‌సీలపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ సుజాత



మనుబోలు : రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

- ఏడీఏ సుజాత

కొడవలూరు : కౌలు రైతులు పంట సాగుదారు హక్కు పత్రం(సీసీఆర్‌సీ) విధిగా పొందాలని కోవూరు ఏడీఏ డి.సుజాత సూచించారు. మండలంలోని రామన్నపాళెంలో పంట సాగుదారు హక్కు పత్రాలపై గురువారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌలు చేస్తున్న ప్రతి రైతు సీసీఆర్‌సీ పొందడం వల్ల ప్రభుత్వ రాయితీలు పొందే వెసులుబాటు ఉంటుందని తెలిపారు. ఈ కార్డు కలిగిన కౌలు రైతులు రాయితీపై విత్తనాలు, బ్యాంక్ ద్వారా పంట రుణాలు పొందవచ్చన్నారు. సాగుదారు హక్కు పత్రం పొందాల్సిన కౌలు రైతులు సంబంధిత వీఏఏ, వీఆర్వోలను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ లక్ష్మి, వీఏఏ ఆర్.నిహారిక, రైతు నాయకుడు కె.శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

సీసీఆర్ కార్డులు కలిగి ఉండాలి

మనుబోలు : కౌలు రైతులు సీసీఆర్‌సీ (పంట సాగుదారు హక్కు పత్రం) కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి షేక్ జహీర్ సూచించారు. మనుబోలు రైతు భరోసా కేంద్రంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలుకు పొలం సాగు చేసే రైతులు పంట సాగుదారు హక్కుపత్రం కలిగి ఉంటేనే అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందన్నారు. సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, ప్రకృతి విపత్తుల సమయంలో పంట నష్టపరిహారం అందుతాయని తెలిపారు. వివిధ పంటలకు బీమా వర్తిస్తుందన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థినుల ఎంపిక



బి.సుకృత



ఎ.భవ్యచరిత



కె.స్నేహిత



బి.హిమవర్షిత

పొదలకూరు : మండలంలోని మూడు ప్రభుత్వ పాఠశాలల నుంచి నలుగురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. తోడేరులోని కాకాణి శేషమ్మ జెడ్పీహైస్కూల్ విద్యార్థిని బి.సుకృత నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. విరువూరు జెడ్పీహైస్కూల్ విద్యార్థిని ఎ.భవ్యచరిత ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. పొదలకూరు డీఎన్నార్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన కె.స్నేహిత నూజివీడుకు, బి.హిమవర్షిత ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులను పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్



మాట్లాడుతున్న నగర డీఎస్పీ శ్రీనివాసులు

కోవూరు : రెండు రోజుల క్రితం కోవూరు రాళ్లమిట్ట ప్రాంతంలో జరిగిన హత్య కేసులో నేరస్తులను పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు గురువారం కోవూరు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నెల్లూరు నగర డీఎస్పీ శ్రీనివాసులు కేసు వివరాలు వెల్లడించారు. ఈనెల 9వ తేదీన నెల్లూరు నగరం వెంకటేశ్వరపురం గాంధీ జనసంఘం ప్రాంతానికి చెందిన నాగరాజు పందులను పట్టడానికి కోవూరు జంగం వీధికి వచ్చారు. అక్కడ జరిగిన ఘర్షణలో గాంధీ జనసంఘం ప్రాంతానికి చెందిన దుర్గయ్య, కోటేశ్వరరావులు కలిసి నాగరాజును హత్య చేశారు. ఈ క్రమంలో కేసు నమోదు చేసి పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలించి నిందితులను పట్టుకున్నారు. ఈ సమావేశంలో సీఐ శ్రీనివాసరావు, ఎస్సై రంగనాథ్‌గౌడ్ ఉన్నారు.